గుండెపోటుతో తొమ్మిదేండ్ల బాలుడి మృతి

హర్షిత్ (ఫైల్)

జగిత్యాల రూరల్, ఫిబ్రవరి 15 : గుండెపోటుతో తొమ్మిదేండ్ల బాలుడు మృతిచెందాడు. ఈ ఘటన జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామంలో గురువారం చోటుచేసుకున్నది. జగిత్యాల అర్బన్ మండలం ధరూర్‌కు చెందిన బాలగంగాధర్-హరిత దంపతులకు ఇద్దరు కొడుకులు. వీరు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం సాయంత్రం తిరుపతి దైవదర్శనానికి బయలుదేరారు. మొక్కులు చెల్లించి తిరిగి బుధవారం అర్ధరాత్రి ఇంటికి చేరుకున్నారు. ఆ వెంటనే చిన్న కొడుకు బాలె హర్షిత్ (9) గుండెపోటుతో కుప్పకూలాడు. కుటుంబ సభ్యులు దవాఖానకు తరలించే లోపే మృతి చెందాడు. గ్రామంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న హర్షిత్ చనిపోయాడని తెలుసుకున్న తోటి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గ్రామస్థులు కన్నీటి పర్యంతమయ్యారు.

కింగ్స్ గ్రూప్‌లో ఈడీ సోదాలు

కోట్ల విలువైన హవాలా పత్రాల సీజ్

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని కింగ్స్ గ్రూప్ ఆఫ్ కంపెనీకి చెందిన యజమానులు, సంస్థల ఆఫీసులు, సంబంధిత వ్యక్తుల ఇండ్లలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు గురువారం సోదాలు చేశారు. ఉదయం నుంచి ఏడు ప్రాంతాల్లో సోదాలు చేపట్టి.. లెక్కకు చూపని రూ.76.5 లక్షల నగదు, రూ.1.5 లక్షల విలువైన విదేశీ కరెన్సీ, పలు డిజిటల్ పరికరాలు, బ్యాంకు పాస్‌బుక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఫెమా నిబంధనలకు విరుద్ధంగా యూఏఈ, యూకే సహా పలు విదేశీ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టారనే సమాచారం మేరకు సోదాలు చేసినట్టు అధికారులు వెల్లడించారు. ఇంటెలిజెన్స్ హవాలా నెట్‌వర్క్ ద్వారా అక్రమంగా విదేశీ మారకద్రవ్యంలోనూ కింగ్స్ గ్రూప్ కంపెనీల పాత్ర ఉన్నట్లు ఈడీ అధికారులు గుర్తించారు. ఈ సోదాల్లో అనేక కోట్ల రూపాయల విలువైన దేశీయ, అంతర్జాతీయ హవాలాకు సంబంధించిన పత్రాలు, బినామీ ఆస్తుల పత్రాలు స్వాధీనం చేసుకొన్నట్టు వివరించారు. ఈ కేసు విచారణలో ఉన్నదని.. మరిన్ని వివరాలు త్వరలో వెల్లడిస్తామని తెలిపారు.

పేరు మార్పు సరే.. కిట్ల సరఫరా ఏదీ?

- ఎంసీహెచ్ కిట్‌గా మారిన కేసీఆర్ కిట్
- రెండు నెలలుగా నిలిచిన కిట్ల సరఫరా
- వేల మంది బాలింతల ఎదురుచూపులు
- దవాఖాన్లలో తగ్గనున్న కాన్పులు
- మాతాశిశు మరణాలపై ప్రభావం

నాగర్‌కర్నూల్ జిల్లా దవాఖానలోని ఓ వార్డులో బాలింతలు

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ కిట్. దీనిని మాతాశిశు మరణాలను అరికట్టేందుకు నాటి కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన బృహత్తర పథకం. ఈ పథకం ద్వారా.. జన్మనిచ్చిన తల్లికి, పుట్టిన శిశువుకు ఆర్థిక సహాయంతోపాటు 13 రకాల వస్తువులు అందేవి. అలాంటి కిట్ల సరఫరా.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిలిచిపోయింది. అంతేకాదు.. ఈ పథకం పేరు మదర్, చైల్డ్ హెల్త్ (ఎంసీహెచ్)గా మారిపోయింది. ఈ నేపథ్యంలో.. పేరు మార్పు సరే కానీ.. కిట్ల సరఫరా ఎప్పుడోనని వేలాది మంది బాలింతలు ఎదురుచూస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే.. మాతాశిశు మరణాలను అరికట్టడంపైనా ప్రభావం చూపడంతోపాటు సర్కారు దవాఖాన్లలో కాన్పులు జరగాలన్న ప్రభుత్వ లక్ష్యం నీరుగారే ప్రమాదం ఉన్నది.

ఎంసీహెచ్ కిట్ల సరఫరా ఎప్పుడో?

ఎంసీహెచ్ (మదర్, చైల్డ్ హెల్త్) కిట్ల సరఫరాపై ప్రభుత్వ నిర్లక్ష్యం వహిస్తున్నది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో 2017, జూలై 20న ఈ పథకం ప్రారంభమైంది. ప్రభుత్వం ఈ పథకం కింద.. సర్కారు దవాఖాన్లలో కాన్పులు చేయించుకున్న వారికి మగ శిశువు పుడితే రూ. 12 వేలు, ఆడ శిశువు జన్మిస్తే రూ.13 వేలు అందించేది. మాతాశిశువుకు ఉపయోగపడే బేబి నూనె, బేబీ పౌడర్, డ్రెస్సులు, చీరలు, హ్యాండ్ బ్యాగ్, టవల్, న్యాప్కిన్లు, షాంపూ, బొమ్మల్లాంటి పలు రకాల వస్తువులను ఇచ్చేది. ఈ పథకం ప్రారంభమైనప్పటి నుంచి ప్రతి జిల్లాలో వేలాది మందికి ప్రయోజనం చేకూరింది. ఈ ప్రోత్సాహం వల్ల కుటుంబీకులు కూడా గర్భిణులను ప్రభుత్వ దవాఖాన్లలో చేర్పించి అక్కడే కాన్పులు చేయిస్తున్నారు. దీంతో మాతాశిశు మరణాలు చాలా వరకు తగ్గాయి. దీనికి ఎంసీహెచ్ పథకమే కారణం. అలాంటి ఈ కిట్ల పంపిణీ రెండు నెలలుగా నిలిచిపోయింది. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. పేరు మార్పుపై చూపిన శ్రద్ధ కిట్ల పంపిణీపై చూపించడం లేదనే విమర్శలున్నాయి. ఆయా జిల్లాల వైద్యారోగ్య శాఖ అధికారులు ఇప్పటికే ప్రభుత్వానికి కిట్ల ఆవశ్యకతపై నివేదికలు పంపించారు. వేలాది మంది మహిళలు ఈ కిట్ల కోసం ఎదురు చూస్తున్నారని, కాన్పుల తర్వాత కిట్లను అడిగితే దవాఖాన్లలో డాక్టర్లు సమాధానం చెప్పలేని పరిస్థితులు ఏర్పడ్డాయని పేర్కొంటున్నారు. రెండు నెలల కిందటి వరకు దవాఖాన్లలో కాన్పులు అయిన వెంటనే కేసీఆర్ కిట్లను అందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో ఇప్పుడు ఆ పరిస్థితులు కనిపించడం లేదు.

వెయ్యి కిట్లు అవసరం

నాగర్‌కర్నూల్ జిల్లా దవాఖానలో కాన్పుల సంఖ్య అధికంగా ఉంది. రోజూ 20 వరకు ప్రసవాలు జరుగుతుండటంతో ఆయా జిల్లాల దవాఖానల అధికారులు కిట్ల పంపిణీపై సమాధానం చెప్పలేకపోతున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా దవాఖానలో రోజూ 20 నుంచి 30 కాన్పులు జరుగుతుండగా 20 వరకు మాత్రమే కిట్లు ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నది. ఇక జిల్లాలోని 20 మండలాల పరిధిలో 28 పీహెచ్‌సీలు ఉన్నాయి. ఇప్పటివరకు జిల్లాలో కేవలం 500 కిట్లు మాత్రమే ఉండగా.. బిజినేపల్లి, బొప్పల్లి, కోడేరు, వంగూరు, వెల్దండ, వెన్నచర్ల వంటి 10 దవాఖాన్లలో ఒక్క కిట్ కూడా అందుబాటులో లేకపోవడం గమనార్హం. కాన్పుల కోసం పలు దవాఖాన్లలో 24 గంటల వైద్య సేవలు అందిస్తున్నారు. కిట్ల సరఫరా ఆగిపోవడంతో ఆయా దవాఖాన్లలో కాన్పులపై ప్రభావం పడే అవకాశం ఉంది. తద్వారా మాతాశిశు మరణాలను అరికట్టాలన్న సదుద్దేశం నీరుగారిపోనున్నది. కేసీఆర్ కిట్ పథకం పేరు మార్చిన ప్రభుత్వం.. కిట్ల పంపిణీపై కూడా అదే స్థాయిలో చర్యలు చేపట్టాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతం వెయ్యి కిట్లు అవసరం కాగా.. 500 కిట్లు మాత్రమే ఉన్నట్టు అధికారులు తెలిపారు. ఇలాగే నిర్లక్ష్యం వహిస్తే ప్రభుత్వ వైద్యంపై ఇప్పటి వరకు ప్రజలకు ఏర్పడిన నమ్మకం సడలిపోనున్నది.

ఈ నెలలో కిట్లు వస్తాయి

ఎంసీహెచ్ కిట్ల సరఫరాపై రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖకు నివేదించాం. సర్కారు దవాఖాన్లలో జరుగుతున్న కాన్పులను బట్టి అందుబాటులో ఉన్న కిట్లను పంపిణీ చేస్తున్నాం. జిల్లాలో 500 వరకు ఎంసీహెచ్ కిట్లు ఇప్పటి వరకు అందుబాటులో ఉన్నాయి. ఈ నెలలో కిట్ల వచ్చే అవకాశం ఉంది. వచ్చిన వెంటనే కాన్పులు చేయించుకున్న మహిళలందరికీ ఈ కిట్లను అందిస్తాం. -సుధాకర్‌లాల్, డీఎంహెచ్‌వో నాగర్‌కర్నూల్

మృతి చెందిన కానిస్టేబుల్ యాదయ్య కుటుంబ సభ్యులకు ఇంటి స్థలం డాక్యుమెంట్లను అందజేస్తున్న సీపీ అవినాష్ మహంతి, యాదయ్య స్నేహితులు

యాది మరువక.. సాయం విడువక!

- కానిస్టేబుల్ కుటుంబానికి సహచరుల చేయూత
- 200 గజాల స్థలం ఇచ్చిన తోటి ఉద్యోగులు
- డాక్యుమెంట్లు అందజేసిన సీపీ అవినాష్ మహంతి

హైదరాబాద్ సిటీబ్యూరో, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): విధి నిర్వహణలో కఠినంగా వ్యవహరించే పోలీసులంటే.. కర్కశ గుణం గలవారు అన్న భావనే చాలా మందిలో గూడుకట్టుకొని ఉంటుంది. కానీ.. వారు కూడా మనసున్న మారాజులేనని, దాతృత్వాన్ని చాటడంలో వారూ ముందుంటారన్న విషయం ఎంత మందికి తెలుసు? ఔను, ఖాకీల్లోనూ మానవత్వం మూర్తీభవించి ఉంటుందన్న సంగతి మరోమారు రుజువైంది! కలిసి పనిచేసిన పోలీసు అనుకోకుండా జీవితాన్ని ముగించగా సహచరులు అతని స్నేహాన్ని 'యాది' మరువలేకపోయారు. సాయం చేయకుండా ఉండలేకపోయారు. గుండెపోటుతో మృతిచెందిన ఓ కానిస్టేబుల్ కుటుంబానికి తోటి ఉద్యోగులు అండగా నిలిచారు. వివరాలివీ.. పర్మగల్ల యాదయ్య 2007లో ఏఆర్ కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరాడు. తర్వాత 2011లో సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికై సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలు ఠాణాల్లో విధులు నిర్వర్తించాడు. యాదయ్య మాదాపూర్ పీఎస్‌లో విధులు నిర్వర్తిస్తుండగా గత ఆగస్టు 8న అర్ధరాత్రి గుండెపోటుతో చనిపోయాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. తోటి ఉద్యోగులు, తన బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుళ్లు యాదయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని నిర్ణయించుకున్నారు. మాదాపూర్ ఠాణా సిబ్బందితోపాటు సైబరాబాద్, రాచకొండ, కరీంనగర్‌లో పనిచేస్తున్న 2011 బ్యాచ్ కానిస్టేబుళ్లంతా కలిసి రూ.15 లక్షలు విరాళాలు సేకరించారు. శంషాబాద్ దగ్గరలోని పెద్ద షాపూర్‌లో యాదయ్య పిల్లల పేరిట 200 గజాల స్థలాన్ని కొనుగోలు చేశారు. గురువారం సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి చేతుల మీదుగా యాదయ్య కుటుంబానికి డాక్యుమెంట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాదాపూర్ డీసీపీ జీ వినీత్, ఇన్‌స్పెక్టర్ మల్లేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేద బాలికలకు చేయూత

- బీమా చేయించిన మాజీ సర్పంచ్
- 17 ఏండ్లపాటు ప్రీమియం చెల్లిస్తానని హామీ

కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం శాలపల్లి-ఇందిరానగర్‌లో బాలికలకు ఎల్ఐసీ పత్రాలను అందజేస్తున్న మాజీ సర్పంచ్ శారద ప్రవీణ్

హుజూరాబాద్‌టౌన్, ఫిబ్రవరి 15 : కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం శాలపల్లి-ఇందిరానగర్ గ్రామంలో మాజీ సర్పంచ్ కోడిగూటి శారద ప్రవీణ్ బాలికలకు బీమాతో ధీమా కల్పించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఆరో తరగతి నుంచి పదోతరగతి వరకు చదువుకునే 30 మంది నిరుపేద బాలికలకు గురువారం ఒక్కొక్కరికి రూ.5,500 చొప్పున తన సొంత ఖర్చుతో ఎల్ఐసీ పాలసీలు చేయించారు. ఇది న్యూ ఎండోమెంట్ పాలసీ అని, ఒక్కో విద్యార్థికి రూ.5,500 చొప్పున 17 ఏండ్లు చెల్లిస్తే 18వ సంవత్సరం రూ.3 లక్షల వరకు విద్యార్థులకు వస్తాయని మాజీ సర్పంచ్ శారద ప్రవీణ్ తెలిపారు. కనీసం రెండేండ్లు బీమా చెల్లించిన విద్యార్థులకు ఉన్నత విద్య కోసం రూ.3 లక్షల వరకు రుణ సదుపాయం కల్పిస్తారని పేర్కొన్నారు. వీరి ప్రీమియాన్ని ఏటా తామె చెల్లిస్తామని చెప్పారు. అనంతరం కొందరికి గురువారం ఎల్ఐసీ బాండ్స్ అందజేశారు. మిగతా వారికి మార్చి 5లోగా బాండ్స్ అందజేస్తానని తెలిపారు. ప్రతి ఆడపిల్ల చదువుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు మాజీ సర్పంచ్ దంపతులు పేర్కొన్నారు.

ప్రముఖ కవి రాజయ్య ఇకలేరు

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 15: ప్రముఖ రచయిత, ప్రజాకవి, విశ్రాంత ఉపాధ్యాయుడు, వికలాంగుల సంఘం నాయకుడు నల్లెల రాజయ్య (62) కన్నుమూశారు. ములుగు జిల్లా జాకారానికి చెందిన ఆయన హనుమకొండలో నివాసం ఉంటున్నారు. కొంతకాలం నుంచి అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతి తుదిశ్వాస విడిచారు. రాజయ్య అనేక కవితలు, వ్యాసాలు రాస్తూ, హక్కుల గొంతుకగా ప్రజలను చైతన్యం చేశారు. ఆయన మృతి పట్ల సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ ప్రతినిధులు, తెలంగాణ రచయితల సంఘం నాయకులు, తెరసం సభ్యులు, కాళోజీ ఫౌండేషన్, మిత్ర మండలి బాధ్యులు సంతాపం ప్రకటించారు.

కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కన్నాపూర్‌లో చోరీకి గురైన ఎల్లిగడ్డల పంట

కన్నాపూర్‌లో ఎల్లిగడ్డ దొంగలు

- పొలంలో నుంచే పీక్కెళ్లిన చోరులు
- 40 వేల విలువైన పంట అపహరణ

శంకరపట్నం, ఫిబ్రవరి 15: ఇటీవల ఎల్లిగడ్డ ధరలు పెరిగిపోవడంతో దొంగలు పంట చేన్లలో చోరీ చేస్తున్నారు. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కన్నాపూర్ గ్రామంలో ఎల్లిగడ్డను గుర్తుతెలియని వ్యక్తులు పొలంలో నుంచే ఎల్లిగడ్డ పంటను పీక్కొని పోయారు. గ్రామానికి చెందిన రైతు గుండెవేని శంకర్ గ్రామ శివారులోని ఓ గుంట మడిలో ఎల్లిగడ్డ సాగు చేశాడు. పంట ఇటీవల కోతకు రాగా దొంగలు రాత్రి సమయంలో పంట కోసుకువెళ్లారు. దీని విలువ దాదాపు రూ.40 వేలు ఉంటుందని, తనకు న్యాయం చేయాలని బాధిత రైతు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పసుపు క్వింటాల్@ 12,559

ఈ సీజన్‌లో ఇదే అత్యధికం

మెట్‌పల్లి, ఫిబ్రవరి 15: జగిత్యాల జిల్లా మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌లో గురువారం రికార్డు ధర లభించింది. పసుపు కాడి (కొమ్ము) క్వింటాల్‌కు గరిష్ఠ ధర రూ.12,559, కనిష్ఠ ధర రూ.4,059 పలికింది. కాగా పసుపు గోళ (మండ) క్వింటాల్‌కు గరిష్ఠ ధర రూ.11,111, కనిష్ఠ ధర 6,565 వచ్చింది. క్రయ, విక్రయాలు ప్రారంభమైన మొదటిరోజు మార్కెట్‌లో 285 క్వింటాళ్లు, రెండో రోజైన గురువారం 203 క్వింటాళ్ల కొనుగోళ్లు జరిగాయి.

- సమ్మక్కకు ముస్లిం భక్తుల ఎత్తు బంగారం

కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కరింపేట్‌కు చెందిన ఎండీ సర్దార్-షబాన దంపతులు తమ కుటుంబ సభ్యులతో కలిసి సమ్మక్కను దర్శించుకొన్నారు. కొడుకు నవాజ్ ఇటీవల అనారోగ్యానికి గురికాగా, వారు వన దేవతలకు మొక్కున్నారు. అతడి ఆరోగ్యం కుదుటపడగా గురువారం శంకరపట్నంలోని సమ్మక్క గద్దెకు చేరుకొని బాలుడి ఎత్తు బంగారం సమర్పించారు. - శంకరపట్నం

భగ్గుమన్న చెరుకు రైతులు

- గాయత్రీ షుగర్ ఫ్యాక్టరీ కార్యాలయానికి తాళం
- కూలీలను పంపించాలని డిమాండ్

మెట్‌పల్లిలోని గాయత్రీ చక్కెర ఫ్యాక్టరీ కార్యాలయానికి తాళం వేస్తున్న రైతులు

మెట్‌పల్లి, ఫిబ్రవరి 15 : చెరుకు నరికివేతకు కూలీలను పంపించకుండా కాలయాపన చేస్తున్న గాయత్రీ చక్కెర ఫ్యాక్టరీ యాజమాన్యం తీరుపై రైతులు భగ్గుమన్నారు. గురువారం జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలోని గాయత్రీ చక్కెర ఫ్యాక్టరీ కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలిపారు. మల్లాపూర్ మండలం రాఘవపేటకు చెందిన పలువురు రైతులు కామారెడ్డి జిల్లా సదాశివనగర్ సమీపంలోని గాయత్రీ చక్కెర ఫ్యాక్టరీ ప్రతినిధులతో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు సుమారు 22 ఎకరాల్లో చెరుకు సాగుచేశారు. పంట చేతికి వచ్చింది. క్రషింగ్ ప్రారంభమై మూడు నెలలు కావస్తున్నా తమ చెరుకును కట్ చేసి ఫ్యాక్టరీకి తరలించే ప్రక్రియలో కాలయాపన జరుగుతుండటంపై సాగు రైతుల్లో ఆందోళన వ్యక్తమైంది. ఫ్యాక్టరీలో క్రషింగ్ ప్రక్రియ మరికొద్ది రోజులే ఉండటంతో తమ చెరుకు పరిస్థితి ఏంటనే ఆవేదనలో ఉన్నారు. తమతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం చెరుకు కోతలకు కార్మికులను పంపించకుండా ఫ్యాక్టరీ యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తున్నదని, తక్షణమే చెరుకు కోతలకు కూలీలను పంపించాలని డిమాండ్ చేస్తూ సంబంధిత ఫ్యాక్టరీకి సంబంధించిన కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలిపారు.

కాలేశ్వరం ఈఎన్‌సీగా సుధాకర్‌రెడ్డి

జయశంకర్ భూపాలపల్లి, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ) : కాళేశ్వరం ఎత్తిపోతల (రామగుండం) ఈఎన్‌సీగా కొట్టె సుధాకర్‌రెడ్డిని నియమిస్తూ ఇరిగేషన్ శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇదివరకు ఈఎన్‌సీగా పనిచేసిన నల్లా వెంకటేశ్వర్లును ప్రభుత్వం ఇటీవల ఆ పదవి నుంచి తొలగించిన విషయం తెలిసిందే. కాగా జగిత్యాలలో ఇరిగేషన్ సీఈగా పనిచేస్తున్న సుధాకర్‌రెడ్డికి కాళేశ్వరం ఈఎన్‌సీగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బరాజ్ కుంగిన నేపథ్యంలో ప్రస్తుతం ప్రాజెక్టు మరమ్మతు బాధ్యతలు సుధాకర్‌రెడ్డి భుజాన పడ్డాయి.

జనం రాలేదని మందలింపు

- బీజేపీ గిరిజన నేతపై ఆ పార్టీ నాయకురాలు రుద్రమ ఆగ్రహం
- ప్రజాహితయాత్రకు ఎందుకు రాలేదని బూతులు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 15 : బీజేపీ నాయకురాలు రాణి రుద్రమ అదే పార్టీకి చెందిన గిరిజన నాయకుడిపై రుసరుసలాడారు. ప్రజాహిత యాత్రకు జనాన్ని ఎందుకు తీసుకురాలేదని బూతు పురాణం అందుకున్నారు. రెండు రోజుల క్రితం వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట మండల కేంద్రాల్లో కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ చేపట్టిన ప్రజాహిత యాత్రకు జనాన్ని ఎందుకు తీసుకురాలేదని అభ్యంతరకర రీతిలో బీజేపీ నాయకురాలు రాణి రుద్రమ మాట్లాడారని ఆ పార్టీ నాయకుడు బోడావత్ రవీందర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఆయన రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలో ప్రకటన విడుదల చేశారు. రెండు రోజుల క్రితం వీర్నపల్లిలో ప్రజాహిత యాత్ర చేపట్టిన సందర్భంగా సేవాలాల్, జగదాంబ ఆలయం కోసం బండి సంజయ్ కొంత నగదు ఇచ్చినట్టు గుండారానికి చెందిన రవీందర్ తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీర్నపల్లితోపాటు పక్క మండలాలకు కూడా ఇస్తే బాగుంటుందని గురువారం ఆ పార్టీ నాయకురాలు రాణిరుద్రమను విన్నవించుకోగా ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లిలో పర్యటించినప్పుడు ఎందుకు రాలేదని? ఉంటే ఉండండి, పోతే పోండి అంటూ (అభ్యంతరకర భాషలో) అవమానించారని రవీందర్ ఆవేదన వ్యక్తంచేశారు. గిరిజన జాతి కోసం విన్నవిస్తే ఆత్మాభిమానం దెబ్బతినేలా మాట్లాడినట్టు విస్మయం వ్యక్తంచేశారు.

కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న మోదీ సర్కార్

- కాంగ్రెస్ నేత దిగ్విజయ్ ధ్వజం

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): రైతుల సమస్యలు పట్టని ప్రధాని మోదీ తన కార్పొరేట్ మిత్రులకు మాత్రం దేశాన్ని దోచిపెడుతున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ సీఎం దిగ్విజయ్‌సింగ్ ఆరోపించారు. రైతులకు కనీసం నిరసన తెలియజేసే అవకాశం కూడా లేకుండా నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గాంధీభవన్‌లో గురువారం ఆయన బీజేపీ సర్కార్‌పై 'దస్ సాల్.. అన్యాయ్ కాల్' పేరుతో రూపొందించిన డాక్యుమెంట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపా దాసు మున్షీతో కలిసి మీడియాతో మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ హయాంలో పదేండ్లుగా దేశానికి ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా జరిగిన అన్యాయాలను తమ డాక్యుమెంట్‌లో పొందుపరిచామని చెప్పారు. మోదీ తన హయాంలో మొత్తంగా కార్పొరేట్లకు కొమ్ముకాసే పనులే చేశారని ధ్వజమెత్తారు. మోదీ సర్కార్ ఎన్నడూ రైతులు గురించి ఆలోచించలేదని అన్నారు. కర్ణాటక, తెలంగాణలో తమ పార్టీ ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేస్తుంటే, ప్రధాని మోదీ ఇచ్చిన హామీలు కాగితాలకే పరిమితం అయ్యాయని విమర్శించారు.

బురఖా ధరించి గర్ల్స్ హాస్టల్‌లోకి యువకుడు

పట్టుకుని పోలీసులకు అప్పగించిన విద్యార్థినులు

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 15: కాకతీయ యూనివర్సిటీలోని పోతన గర్ల్స్ హాస్టల్‌కు చెందిన ఎంబీఏ విద్యార్థిని బురఖా వేసుకున్న యువకుడితో కలిసి బైక్‌పై మంగళవారం రాత్రి 10గంటలకు హాస్టల్‌లోకి వచ్చింది. వారు మొదటి గేటు నుంచి రావడంతో అక్కడే ఉన్న కొందరు విద్యార్థినులు గమనించి వెంబడించారు. హాస్టల్‌లోకి వెళ్తుండగా వారిని అడ్డుకుని ప్రశ్నించగా మాట్లాడలేదు. అనుమానం వచ్చి బురఖా తీయగా యువకుడిగా తెలిసింది. ఈ విషయాన్ని వెంటనే కేయూ హాస్టల్ డైరెక్టర్ శ్రీనివాసరావుకు తెలుపగా.. ఆయన పోలీసులకు సమాచారమిచ్చారు. వారు యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. ఎంబీఏ విద్యార్థినిని వర్సిటీ అధికారులు మందలించి, ఆమెకు తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. విద్యార్థిని భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయలేదని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా వారంరోజులపాటు సస్పెండ్ చేస్తామని హాస్టల్ డైరెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు.

రేవంత్‌రెడ్డిది మొండి వాదన

- తెలంగాణ వాటాలో ఒక్క నీటిబొట్టు కూడా మాకొద్దు
- ఏపీ మంత్రి అంబటి రాంబాబు

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): నదీజలాల పంపిణీని విభజన చట్టంలో పొందుపరిస్తే దాన్ని అంగీకరించబోమని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి మొండిగా వాదిస్తున్నారని ఏపీ నీటిపారుదలశాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు రెండు రాష్ట్రాలకు సంబంధించినదని, అయితే.. ఏపీకి ప్రాజెక్టులు అప్పగించబోమని తెలంగాణ అసెంబ్లీ తీర్మానం చేయడం సరికాదన్నారు. తెలంగాణ వాటాలో ఒక్క నీటి బొట్టు కూడా ఏపీకి అవసరం లేదని, బచావత్ ట్రిబ్యునల్ ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీల నీటిని కేటాయించిందని మంత్రి అంబటి రాంబాబు గుర్తుచేశారు.

19, 20 తేదీల్లో డీఎల్ పోస్టులకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్

హైదరాబాద్, జనవరి 15 (నమస్తే తెలంగాణ): డిగ్రీ లెక్చరర్ ఉద్యోగాలకు 1:2 మెరిట్ జాబితాను రాష్ట్ర గురుకుల విద్యాలయాల సంస్థ నియామక బోర్డు (ట్రిబ్) గురువారం రాత్రి విడుదల చేసింది. ఈ జాబితాలో ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 19, 20 తేదీల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నట్టు ట్రిబ్ అధికారులు పేర్కొన్నారు. నిరుడు ఆగస్టు నెలలో పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే.

విద్యా - ఉద్యోగ సమాచారం

ఏప్రిల్ 22 వరకు పాలిసెట్ దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ) : 2024-25 విద్యాసంవత్సరానికి పాలిటెక్నికల్ కాలేజీల్లో ప్రవేశానికి పాలిసెట్‌ను మే 17న నిర్వహించనున్నట్టు రాష్ట్ర సాంకేతిక విద్య శిక్షణ మండలి (ఎస్‌బీటీఈటీ) కార్యదర్శి తెలిపారు. పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకొనేందుకు ఏప్రిల్ 22 వరకు అవకాశం కల్పించామని పేర్కొన్నారు. ఎస్ఎస్‌సీ లేదా సీబీఎస్‌సీ టెన్త్‌క్లాస్‌తో పాటు తత్సమానమైన పరీక్షలో ఉత్తీర్ణులైన వారు పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకొనేందుకు అర్హులని తెలిపారు. వివరాలకు 040-23222192 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

20 నుంచి సీఏపీఎఫ్ కానిస్టేబుల్ పరీక్ష

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ) : సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ (సీఏపీఎఫ్)లో కానిస్టేబుల్ (జనరల్ డ్యూటీ), అస్సాం రైఫిల్స్‌లోని ఎస్ఎస్ఎఫ్, రైఫిల్‌మ్యాన్ (జనరల్ డ్యూటీ)కు చెందిన కంప్యూటర్ బేస్డ్ పరీక్షను ఈ నెల 20 నుంచి మార్చి 7 వరకు నిర్వహించనున్నారు. స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పరీక్షను తొలిసారిగా 13 ప్రాంతీయ భాషల్లో నిర్వహిస్తున్నారు. దక్షిణాది నుంచి ఈ పరీక్షలు రాసేందుకు 3,15,599 మంది అభ్యర్థులు అర్హత సాధించారని తెలిపారు. వివరాలకు 044-28251139, 9445195946 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఇంటర్ పరీక్షలకు హెచ్ఎంల సేవలు

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని ఇంటర్మీడియట్